సాక్షి
మహబూబాబాద్
బుధవారం । 25 । జూన్ । 2025



ఎట్టకేలకు డైరెక్టర్ల నియామకం

టీజీ ఎన్పీడీసీఎల్‌కు డైరెక్టర్లుగా నలుగురిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ ఉత్తర్వులు జారీ చేశారు. - 8లో▸



డీసీసీబీ టర్నోవర్ రూ.2,230 కోట్లు

వరంగల్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు టర్నోవర్ రూ.2,230 కోట్లకు చేరుకుందని డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు తెలిపారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
33.0^0/24.3^0

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఆకాశం మేఘావృతమై పలుచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

బోనస్.. నర్వస్

నెలలు గడిచినా జమకాని సన్నధాన్యం బోనస్

- కండ్లు కాయలు కాసేలా ఎదురుచూస్తున్న రైతులు
- జిల్లాలో రూ.70కోట్ల మేర బకాయి
- ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి



సాక్షి, మహబూబాబాద్: సన్నరకం ధాన్యం సాగు చేస్తే బోనస్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో రైతులు పోటీపడి పంట వేశారు. అయితే కొనుగోలు కేంద్రాల్లో అమ్మిన ధాన్యానికి బోనస్ ఇప్పటి వరకు రాలేదు. నెలరోజులకు పైగా కొనుగోళ్లు జరిగినా.. ఇప్పటి వరకు ఒక్క రైతుకు కూడా బోనస్ పడలేదు. దీంతో వారు డబ్బుల కోసం కండ్లు కాయలు కాసేలే ఎదురుచూస్తున్నారు.

ఆశతో సన్నాల సాగు..

సన్నధాన్యానికి మద్దతు ధరతో పాటు క్వింటాకు అదనంగా రూ.500 బోనస్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. దీంతో యాసంగిలో 1,36,236 ఎకరాల్లో వరి సాగు చేశారు. ఇందులో అత్యధికంగా 1,12,603 ఎకరాల్లో సన్న రకాలు సాగు చేశారు. అత్యల్పంగా 23,633 ఎకరాల్లో మాత్రమే దొడ్డు రకం వంగడాలు వేశారు వీటి ద్వారా మొత్తం 2,63,577 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చే అవకాశం ఉందని అధికారులు లెక్కించారు. ఇందులో 84,577 మెట్రిక్ టన్నులు రైతులు, కూలీల అవసరాల కోసం, అదే విధంగా మిల్లర్లు, ప్రైవేట్ వ్యాపారులకు అమ్మకాలు చేస్తారని భావించారు. ఇవి పోగా మిగిలిన 1.79లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యం పెట్టుకున్నారు. 239 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి 1,76,100 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు.

రైతుల అరిగోస..

బోనస్‌కు ఆశపడి సన్న రకం ధాన్యం సాగుచేస్తే కొనుగోళ్ల కేంద్రాల్లో రైతులు పడని ఇబ్బందులు లేవు. ఒక కేంద్రంలో తూకంలో మోసం.. మరో కేంద్రంలో డబ్బులు ఇచ్చిన వారి ధాన్యం ముందు కాంటాలు పెట్టడం, గన్నీ సంచుల కొరత, కాంటాలు పెట్టిన ధాన్యం ఎగుమతి చేసేందుకు లారీల కొరత.. ఆపై ఉరుములు మెరుపులతో అకాల వర్షాల భయం.. టార్పాలిన్లు లేక భూమి మీద పోసిన ధాన్యం తడిసిన సంఘటనలు ఉన్నాయి. కాంటాలు పెట్టిన ధాన్యం పలుచోట్ల మొలకెత్తింది. నెలల తరబడి కేంద్రాల్లో ఉండలేక ధాన్యానికి నిప్పు పెట్టి.. తాను నిప్పు పెట్టుకుంటానని రైతులు సిద్ధమైన సంఘటనలు ఉన్నాయి. ఇన్ని ఇబ్బందులు పడి ధాన్యం అమ్మితే ఇప్పటి వరకు బోనస్ అందలేదు.

రూ.70కోట్లు పెండింగ్..

ప్రభుత్వం జిల్లా వ్యాప్తంగా 239 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసింది. వీటి ద్వారా 35,207 మంది రైతుల నుంచి 1,76,100 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసింది. ఇందులో 35,970 మెట్రిక్ టన్నులు దొడ్డు రకం కాగా.. 1,40,130 మెట్రిక్ టన్నుల సన్న రకం ధాన్యం కొన్నారు. వీటికి మొత్త రూ. 4,08.48కోట్లు చెల్లించారు. సన్న రకం ధాన్యంపై ప్రభుత్వం ప్రకటించిన క్వింటాకు రూ. 500 చొప్పున 28,016 మంది రైతులకు రూ.70కోట్ల మేరకు బోనస్ డబ్బులు ఇప్పటి వరకు రాలేదు.

జిల్లాలో యాసంగి ధాన్యం కొనుగోలు వివరాలు
ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలు : **239**
కొనుగోలు లక్ష్యం : **1.79** లక్షల మెట్రిక్ టన్నులు
ధాన్యం అమ్మిన రైతులు : **35,207** మంది
కొనుగోలు చేసిన ధాన్యం : **1,76,100** మెట్రిక్ టన్నులు
సన్నరకం ధాన్యం : **1,40,130** మెట్రిక్ టన్నులు
దొడ్డురకం ధాన్యం : **35,970** మెట్రిక్ టన్నులు
ధాన్యం విలువ : రూ. **408.48** కోట్లు
బోనస్ విలువ : రూ. **70,06,50,000**
బోనస్ రావాల్సిన రైతులు : **28,016**

బోనస్ పడలేదు..

నాకు 4 ఎకరాల పొలం ఉంది. అందులో 85 క్వింటాళ్ల సన్నధాన్యం పండింది. నెలరోజుల క్రితం పంటను గూడూరు ఐకేపీ కొనుగోలు కేంద్రంలో అమ్మాను. బ్యాంకు ఖాతా, ఆధార్‌కార్డు జిరాక్స్‌లు తీసుకున్నారు. వారంలో బోనస్ డబ్బులు పడతాయన్నారు. కానీ ఇంత వరకు పడలేదు. సుమారు రూ.42,500 రావాలి. ఎప్పుడు పడతాయా అని ఎదురుచూస్తున్నా.



- ఓర్సు శ్రీనివాస్, రైతు, వడ్డెరగూడెం

రైతును రాజు చేయడమే ధ్యేయం



సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న రాంచంద్రునాయక్

- డిప్యూటీ స్పీకర్ జాటోత్ రాంచంద్రునాయక్
- రైతు భరోసా సంబురాల్లో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

కురవి: కాంగ్రెస్ ప్రభుత్వం రైతును రాజు చేయడం కోసం నిరంతరం పని చేస్తోందని, రైతు భరోసా నిధులు తొమ్మిది రోజుల్లోనే రూ. 9వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశామని డిప్యూటీ స్పీకర్ జాటోత్ రాంచంద్రునాయక్ అన్నారు. రైతు భరోసా సంబురాల్లో భాగంగా కురవి రైతు వేదికలో మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి సందేశాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వీక్షించారు. అనంతరం గుడి సెంటర్‌లో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా రైతులనుద్దేశించి రాంచంద్రునాయక్ మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు రైతు భరోసా నిధులు రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. రైతులను ఆదుకోవడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు. ఉచిత విద్యుత్, ఉచిత బస్సు, ఉచిత గ్యాస్ పథకం అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. రాజీవ్ యువవికాసం తర్వాత అమలు చేస్తామని చెప్పారు. ఎన్ని అడ్డకుంలు వచ్చినా ఇచ్చిన మాటను సీఎం రేవంత్‌రెడ్డి నిలబెట్టుకుంటారని ధీమా వ్యక్తం చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు కాంగ్రెస్ కార్యకర్తలు సమాయత్తం కావాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల శంకుస్థాపనలకు పార్టీ నాయకులందరూ వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో డీఏఓ విజయలక్ష్మి, ఏడీఈ విజయచంద్ర, ఏఓలు మోహన్, శ్రీదేవి, నరసింహారావు, ఆలయ చైర్మన్ కొర్ను రవీందర్ రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అంబటి వీరభద్రంగౌడ్, నాయకులు బండి వెంకటరెడ్డి, గార్లపాటి భరద్వాజ్‌రెడ్డి, నారాయణ, రాజేందర్‌కుమార్, అవిరె మోహన్‌రావు, బాలగాని శ్రీనివాస్, బండి లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిరంతర వైద్య సేవలు అందించాలి

- కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

నెహ్రూసెంటర్: వాతావరణ పరిస్థితుల దృష్ట్యా సీజనల్ వ్యాధులతో ఆస్పత్రికి వచ్చే రోగులకు నిరంతరం నాణ్యమైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అన్నారు. జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..ఆస్పత్రిలో కావాల్సిన మందులను సిద్ధం చేసుకోవాలని, పరిసరాల పరిశుభ్రత పాటించాలని, ఎప్పటికప్పుడు శానిటేషన్ నిర్వహించాలని సూచించారు. ఆస్పత్రిలో మెడికల్, ఫీవర్, క్యాజువాలిటీ, ఐసీయూ,మెడికల్‌కేర్, పిడియాట్రిక్, జనరల్ సర్జికల్ వార్డులను పరిశీలించారు. ప్రభుత్వ ఆస్పత్రి, మెడికల్ కళాశాల నిర్మాణ పనులను అడిగి తెలుసుకున్నారు. పనులను వేగవంతంగా పూర్తి చేసేలా కాంట్రాక్టర్లు సమన్వయంతో పని చేయాలన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, ఆర్ఎంఓ జగదీశ్వర్ పాల్గొన్నారు.



రోగులను వైద్య సేవల వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

న్యూస్‌రీల్

కంటి ఆరోగ్యంపై అవగాహన కల్పించాలి

- డీఎంహెచ్ఓ రవిరాథోడ్



నెహ్రూసెంటర్: కంటి ఆరోగ్యంపై ప్రజలకు అవగాహన కల్పించాలని డీఎంహెచ్ఓ రవి రాథోడ్ అన్నారు. మంగళవారం జిలా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఆప్తాలమిక్ ఆఫీసర్స్‌తో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ.. అంగన్వాడీ కేంద్రాల పిల్లల్లో కంటి సంబంధించి లోపాలను గుర్తించి, వరంగల్‌కు చికిత్స నిమిత్తం పంపించాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కంటి ఆరోగ్యంపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్స్ లక్ష్మీనారాయణ, ఆప్తాలమిక్ ఆఫీసర్స్ సుబ్బలక్ష్మి, జోత్స్న, రాజ్‌కుమార్, కృష్ణ, డెమో ప్రసాద్, కేవీ రాజు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

టూర్ ప్యాకేజీలను వినియోగించుకోవాలి

- అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో


మహబూబాబాద్: ఆర్టీసీ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రత్యేక టూర్ ప్యాకేజీలను ప్రయాణికులు వినియోగించుకోవాలని అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో అన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఆర్టీసీ మహబూబాబాద్ డిపో ఆధ్వర్యంలో ప్రత్యేక టూర్ ప్యాకేజీల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 27న రాత్రి 11 గంటలకు శ్రీశైలం, నాగార్జునసాగర్‌కు ఆర్టీసీ స్పెషల్ టూర్ ఉందని, ఆన్‌లైన్‌లో టికెట్లు బుక్ చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సీసీఎల్ కమిషనర్‌ను కలిసిన ఎమ్మెల్యే



కేసముద్రం: మండలంలోని నారాయణపురం గ్రామ రైతుల భూ సమస్యను పరిష్కరించాలని హైదరాబాద్‌లోని సచివాలయంలో సీసీఎల్ కమిషనర్‌ను మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీనాయక్ మంగళవారం కలిశారు. గత ప్రభుత్వం తీసుకువచ్చిన ధరణి పోర్టల్ కారణంగా ఆన్‌లైన్‌లో వందల మంది రైతుల పట్టాభూములు అటవీ భూములుగా చూపించడం వల్ల ప్రభుత్వ పథకాలకు దూరమయ్యారన్నారు. తక్షణమే భూరికార్డులను సరిచేసి నారాయణపురం రైతులకు న్యాయం చేయాలని కోరారు. ఇందుకు కమిషనర్ సానుకూలంగా స్పందించి, న్యాయం చేస్తానని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

స్పోర్ట్స్ స్కూల్స్‌తో విద్యార్థులకు భవిష్యత్



మహబూబాబాద్ అర్బన్: విద్యార్థులు దేశానికి ప్రాతినిధ్యం వహించేలా స్పోర్ట్స్ స్కూల్స్ తీర్చిదిద్దుతాయన్నాని జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి ఓలేటి జ్యోతి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో మంగళవారం జిల్లా స్థాయి స్పోర్ట్స్ స్కూల్ ఎంపికలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లా విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి క్రీడా పాఠశాలలకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. మానుకోట జిల్లా క్రీడలకు పుట్టినిల్లు లాంటిదని, ఇక్కడి నుంచి చాలామంది పలు క్రీడల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థిరపడ్డారన్నారు. సుమారు 100మంది బాలబాలికలకు ఎంపికలకు హాజరయ్యారు. కార్యక్రమంలో పీడీలు, పీఈటీలు శంకర్‌నాయక్, చంప్లనాయక్, వెంకటేశ్వర్లు, విజయ్‌చందర్, సునీల్, వీరభద్రం, రాజకుమారి, కాశీనాథ్, శ్రీనివాస్, కమల్‌కిశోర్, కుమారస్వామి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వన మహోత్సవాన్ని విజయవంతం చేయాలి

మహబూబాబాద్: ప్రజలను భాగస్వామ్యం చేస్తూ వన మహోత్సవాన్ని విజయవంతం చేయాలని సీఎస్ రామకృష్ణారావు అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుంచి సీఎస్ రామకృష్ణారావు ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా 2,30,000లకు పైగా ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు పంపిణీ చేశామన్నారు. ప్రతీ పట్టణంలో కనీసం 500 మంది నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామన్నారు. రైతులకు సమృద్ధిగా ఎరువుల సరఫరాకు పకడ్బందీ చర్యలు తీసుకున్నామన్నారు. 1,25,000 ఎకరాల్లో ఆయిల్‌పామ్ పంట సాగు విస్తీర్ణం లక్ష్యంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఆగస్టు 15 నాటికి భూభారతి రెవెన్యూ సదస్సుల దరఖాస్తుల పరిష్కారం పూర్తి అవుతుందన్నారు. వీసీలో జిల్లా నుంచి కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, అదనపు కలెక్టర్లు లెనిన్ వత్సల్ టొప్పో, వీరబ్రహ్మచారి, జెడ్పీ సీఈఓ పురుషోత్తం, డీపీఓ విజయ నిర్మల తదితరులు పాల్గొన్నారు.



వీసీలో పాల్గొన్న కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్, అదనపు కలెక్టర్లు, అధికారులు

విద్యాశాఖ ఉద్యోగులకు అండగా నిలుస్తాం

- డీఈఓ రవీందర్‌రెడ్డి

తొర్రూరు: విద్యాశాఖ ఉద్యోగులకు అన్ని విధాలా అండగా నిలుస్తామని డీఈఓ రవీందర్‌రెడ్డి తెలిపారు. రోడ్డు ప్రమాదంలో ఇటీవల మృతి చెందిన సీఆర్పీ సర్వి రమేశ్ కుటుంబానికి సమగ్రశిక్ష ఉద్యోగులు, ఉపాధ్యాయులు రూ.3.20 లక్షల ఆర్థిక సాయం అందించారు. మంగళవారం డివిజన్ కేంద్రంలోని వారి నివాసంలో డీఈఓ చేతుల మీదుగా మృతుడి కుటుంబ సభ్యులకు ఆ మొత్తం అందజేశారు. అనంతరం డీఈఓ మాట్లాడుతూ.. విద్యార్థుల సంఖ్య పెంచడంలో, ప్రభుత్వ పాఠశాలల బలోపేతంలో సీఆర్పీల పాత్ర మరువలేనిదన్నారు. రమేశ్ మృతి విద్యాశాఖకు తీరని లోటు అని అన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ మహంకాళి బుచ్చయ్య, సమగ్రశిక్ష ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెల్తూరి మల్లేశం, ఉపాధ్యాయ నాయకులు పులి ముత్తిలింగం, కొలుపుల శ్రీనివాస్, తిరుమలేష్, భీమా నాయక్ తదితరులు పాల్గొన్నారు.



బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందిస్తున్న డీఈఓ రవీందర్‌రెడ్డి

తూకంలో తేడాలు వస్తే చర్యలు

తొర్రూరు: తూకం, కొలతల్లో తేడా వస్తే చర్యలు తీసుకుంటామని తూనికలు, కొలతల శాఖ జిల్లా అధికారి విజయ్‌కుమార్ తెలిపారు. డివిజన్ కేంద్రంలోని ఎరువుల దుకాణాలు, కిరాణా దుకాణాల్లో మంగళవారం తనిఖీ చేపట్టారు. పలువురికి నోటీసులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్యాక్ చేసిన విత్తనాలు, ఎరువులు, నిత్యావసర సరుకుల తూకం తక్కువ ఉందని అనుమానం వస్తే వ్యాపారి వద్ద ఉన్న కాంటా రాళ్లతో సరి చూసుకోవాలన్నారు. నిరంతరం అన్ని రకాల వ్యాపారాల విక్రయ కేంద్రాలపై ఆకస్మిక దాడులు నిర్వహిస్తున్నామని, నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేసి జరిమానాలు విధిస్తున్నామన్నారు. కార్యక్రమంలో డీసీఐసీ చైర్మన్ వింజమూరి సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.



ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న అధికారి విజయ్‌కుమార్

కనీస సౌకర్యాలు కరువు

అంగన్‌వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్లు లేక అవస్థలు

- జిల్లాలో 732 సెంటర్లలో లేని మరుగుదొడ్లు
- ప్రతిపాదనలకే పరిమితం
- వేధిస్తున్న సిబ్బంది కొరత



కేసముద్రం విలేజ్‌లోని అంగన్‌వాడీ కేంద్రం

మహబూబాబాద్: ప్రభుత్వం అంగన్‌వాడీ వ్యవస్థ బలోపేతం కోసం ఈ ఏడాది అమ్మ మాట-అంగన్‌వాడీ కార్యక్రమం చేపట్టింది. కేంద్రాల ద్వారా కొనసాగుతున్న కార్యక్రమాలపై తల్లిదండ్రులకు తెలియజేసి పిల్లల పేర్లు నమోదు చేశారు. ప్రీ ప్రైమరీ విద్యా ప్రాధాన్యతను వివరిస్తున్నారు. అయితే కేంద్రాల్లో మరుగుదొడ్లు, తాగునీరు, విద్యుత్ సౌకర్యం లాంటి విషయాలపై ప్రభుత్వం దృష్టి సారించడం లేదు. అలాగే పోస్టుల ఖాళీలతో పర్యవేక్షణ సక్రమంగా లేక నిర్వహణ అంతంత మాత్రంగానే ఉంది.

1,435 కేంద్రాలు..

జిల్లాలో ఐదు ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 1,435 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. డోర్నకల్ ప్రాజెక్ట్ పరిధిలో డోర్నకల్,గార్ల,కురవి,గూడూరు ప్రాజెక్ట్ పరిధిలో గూడూరు, గంగారం, కొత్తగూడ, మానుకోట ప్రాజెక్ట్ పరిధిలో బయ్యారం,కేసముద్రం, మానుకోట, మరిపెడ ప్రాజెక్ట్ పరిధిలో చిన్నగూడూరు, దంతాలపల్లి, మరిపెడ, నర్సింహులపేట, తొర్రూరు ప్రాజెక్ట్ పరిధిలో నెల్లికుదురు, తొర్రూరు పెద్ద వంగర మండలాలు ఉన్నాయి. ఆ కేంద్రాల్లో జీరో నుంచి ఆరు నెలలోపు పిల్లలు 3,604మంది, ఏడు నెలల నుంచి మూడు సంవత్సరాలలోపు పిల్లలు 20,295మంది, మూడేళ్ల నుంచి ఆరు సంవత్సరాల పిల్లలు 16,181 మంది ఉన్నారు. 330 కేంద్రాలు సొంత భవనాలు, 625 కేంద్రాలు అద్దె లేకుండా(ఫ్రీ రెటెండ్)భవనాలు, 80కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి.

మరుగుదొడ్లు లేని కేంద్రాలు 732..

జిల్లాలో 1,435 అంగన్‌వాడీ కేంద్రాలకు గాను 732 సెంటర్లలో మరుగుదొడ్లు లేవు. 703 కేంద్రాల్లో విద్యుత్ సౌకర్యం లేదు. 397 కేంద్రాల్లో తాగునీటి సౌకర్యం లేక టీచర్లు, ఆయాలు, పిల్లలు, బాలింతలు, గర్భిణులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో 302 సెంటర్లు సొంత భవనాల్లో కొనసాగుతుండగా.. 206 కేంద్రాల్లో మరుగుదొడ్లు, 272 కేంద్రాల్లో విద్యుత్ సౌకర్యం, 137 కేంద్రాల్లో తాగునీటి సౌకర్యం లేదు. కనీసం సొంత భవనాల్లో కూడా కనీస సౌకర్యాలు లేకపోవడంతో పిల్లల తల్లిదండ్రులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రతీ సంవత్సరం జూన్‌లో తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యం లేని కేంద్రాల వివరాలు ఇవ్వాలని ఆశాఖ కమిషనర్ నుంచి ఆదేశాలు రాగానే నివేదిక పంపిస్తారు. అయితే ఇవి ప్రతిపాదలకే పరిమితమవుతున్నాయి.

భారీగా ఖాళీలు..

జిల్లాలో 116 టీచర్, 576 ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అలాగే 58 మంది సూపర్‌వైజర్లకు 46 మంది మాత్రమే ఉన్నారు. ఖాళీలతో పర్యవేక్షణ సక్రమంగా లేదు. చాలా మంది టీచర్లు సమయపాలన పాటించడం లేదు. కొంత మంది టీచర్లు, ఆయాలు తప్పులు చేసినా కేవలం మెమోలు జారీ చేసి వదిలేస్తున్నారు.

నివేదిక తయారు చేస్తున్నాం..

జిల్లాలో మరుగుదొడ్లు, విద్యుత్, తాగునీటి సౌకర్యం లేని కేంద్రాలను గుర్తించి నివేదిక తయారు చేస్తున్నాం. కమిషనర్‌కు నివేదిక పంపిస్తాం. అత్యవసరం ఉన్న కొన్ని కేంద్రాల్లో మరుగుదొడ్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. కేంద్రాల బలోపేతంపై ప్రత్యేక దృష్టి పెట్టాం. సమయపాలన పాటించని సిబ్బందిపై చర్యలు తీసుకుంటున్నాం.

- ధనమ్మ, డీడబ్ల్యూఓ

18 మందికి సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతులు

- పలువురికి స్థాన చలనం

వరంగల్ అర్బన్: ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల్లోని మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న 18మందికి సీనియర్ అసిస్టెంట్‌లుగా పదోన్నతులు కల్పిస్తూ రాష్ట్ర పురపాలక రీజినల్ డైరెక్టర్ షాహిద్ మసుద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. పలువురిని బదిలీ చేశారు. సీనియర్ అసిస్టెంట్లుగా ప్రమోషన్ పొందిన వారిలో వరంగల్ బల్దియాకు చెందిన పి.సంధ్య, సుజాత (ఖమ్మం కార్పొరేషన్), పి.శ్రవణ్ కుమార్ (పరకాల మున్సిపాలిటీ), బీ.సుధీర్, వీరకుమారి (ఇల్లందు), మూడు అశోక్ (కొత్తగూడెం), పి.అశోక్ కుమార్ (జీడబ్ల్యూఎంసీ), చార్లెస్ బ్రౌన్‌సన్ (జీడబ్ల్యూఎంసీ), పి.సరస్వతి (కొత్తగూడెం) ఉన్నారు. వీరిని అదే మున్సిపాలిటీల్లో ఉంచారు. ఆర్.సుధీర్‌ను ఇల్లందు మున్సిపాలిటీనుంచి వైరాకు, లోకేష్ సత్తుపల్లి నుంచి డోర్నకల్‌కు, డి.నాగరాజు ఖమ్మం నుంచి కొత్తగూడెం, రాంచంద్రు సత్తుపల్లినుంచి ఖమ్మం బదిలీ చేశారు. సుక్క శేఖర్ నర్సంపేట నుంచి ఆర్డీ కార్యాలయం, సీహెచ్.సుస్మిత జీడబ్ల్యూఎంసీ నుంచి నర్సంపేటకు, సీహెచ్.అనిల్ కుమార్ జీడబ్ల్యూఎంసీ నుంచి మహబూబాబాద్, దిలీప్ కుమార్ మహబూబాబాద్‌నుంచి సత్తుపల్లికి పదోన్నతి కల్పిస్తూ బదిలీ చేశారు.

మానుకోట మున్సిపల్ కమిషనర్‌గా రాజేశ్వర్

మహబూబాబాద్: వరంగల్ బల్దియా డిప్యూటీ కమిషనర్‌గా పని చేస్తున్న టి.రాజేశ్వర్‌ను మానుకోట రెగ్యులర్ కమిషనర్‌గా బదిలీ చేస్తూ రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్ కమిషనర్ టి.కె.శ్రీదేవి ఉత్తర్వులు జారీ చేశారు. ఈఏడాది ఏప్రిల్ 30న మానుకోట మున్సిపల్ కమిషనర్‌గా పని చేసిన నోముల రవీందర్ పదవీ విరమణ పొందారు. కాగా అదే రోజు వరంగల్ బల్దియా డిప్యూటీ కమిషనర్‌గా పని చేస్తున్న రాజేశ్వర్‌కు మానుకోట ఇన్‌చార్జ్ కమిషనర్ బాధ్యతలు అప్పగించారు. కాగా మంగళవారం కమిషనర్ల బదిలీల్లో భాగంగా రాజేశ్వర్‌ను మానుకోట కమిషనర్‌గా నియమించారు.

తొర్రూరు కమిషనర్‌గా శ్యామ్‌సుందర్..

తొర్రూరు: తొర్రూరు మున్సిపల్ కమిషనర్ శాంతికుమార్ బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో వక్కాల శ్యామ్ సుందర్ కమిషనర్‌గా నియమితులయ్యారు. ఆయన ఇప్పటివరకు నిజాంపేట అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్‌గా పని చేసి కమిషనర్‌గా పదోన్నతి పొందారు. ఈ మేరకు ప్రభుత్వ కార్యదర్శి టికె శ్రీదేవి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. శాంతికుమార్‌కు ఇంకా పోస్టింగ్ ఇవ్వలేదు.

డోర్నకల్ కమిషనర్‌గా నిరంజన్..

డోర్నకల్: డోర్నకల్ మున్సిపల్ కమిషనర్‌గా బి.నిరంజన్ నియమితులయ్యారు. వరంగల్ కార్పొరేషన్‌లో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించిన నిరంజన్ డోర్నకల్ కమిషనర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇక్కడ మేనేజర్‌గా విధులు చేపట్టిన విజయానంద్ పదోన్నతిపై మరిపెడ మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ అయ్యారు.

కేయూ వీసీని కలిసిన రీసెర్చ్ ప్రాజెక్ట్ సభ్యులు

కేయూ క్యాంపస్: రుసా 2.0 ప్రాజెక్ట్ కింద మంజూరైన ×సెంటర్ ఆఫ్ మాలిక్యూల్స్ అండ్ మెటీరియల్స్ ౹ రీసెర్చ్ ప్రాజెక్ట్ ఫెల్లోస్ సెంటర్ డైరెక్టర్ ప్రొఫెసర్ వెంకట్రామ్‌రెడ్డితో కలిసి మంగళవారం కేయూ వైస్ చాన్స్‌లర్ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ వి.రామచంద్రంలను మర్యాద పూర్వకంగా కలిశారు. రుసా 2.0లో భాగంగా ఐదు కేంద్రాల్లో ఒకటిగా ఎంపిక చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. సెంటర్‌లో అధిక ప్రభావం చూపే మంచి జర్నల్స్‌లో మెరుగైన ఫలితాలను ప్రచురించడానికి, నాణ్యమైన పరిశోధన నిర్వహించాలని వీసీ ప్రతాప్‌రెడ్డి.. ప్రాజెక్ట్ ఫెల్లోలకు సూచించారు. కార్యక్రమంలో శ్రీలత, అడిషనల్ కంట్రోలర్ డాక్టర్ పద్మజ, విభాగాధిపతి మంజుల, నరేందర్, రాజు, శ్రీలత, నర్సింహులు పాల్గొన్నారు.



కేయూ వీసీ, రిజిస్ట్రార్‌కు పుష్పగుచ్ఛాలు అందజేస్తున్న రీసెర్చ్ ప్రాజెక్ట్ సభ్యులు

రోడ్డుపై మురుగు..

మానుకోట పట్టణం క్యాబిన్ రోడ్డులోని రైల్వేగేట్ పక్కన డ్రెయినేజీలో వ్యర్థాలు పేరుకుపోయి రోడ్డుపై నుంచి మురుగు పారుతుండటంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. ఆ పక్కనే ఉన్న పాఠశాల విద్యార్థులు సైతం దుర్వాసనతో అవస్థలు పడుతున్నారు. కాగా, అధికారులు తక్షణమే స్పందించి సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

- సాక్షి స్టాఫ్‌ఫొటోగ్రాఫర్, మహబూబాబాద్



క్లుప్తంగా

కాజీపేట జంక్షన్‌ మీదుగా ప్రత్యేక రైళ్లు



కాజీపేట రూరల్‌ : ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని కాజీపేట జంక్షన్‌ మీదుగా ప్రత్యేక రైళ్లను నడిపిస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో ఎ.శ్రీధర్‌ మంగళవారం తెలిపారు.

ప్రత్యేక రైళ్ల వివరాలు..

జూన్‌ 26 నుంచి జూలై 31వ తేదీ వరకు సుబేదార్‌గంజ్‌–చర్లపల్లి (04121) ఎక్స్‌ప్రెస్‌ ప్రతీ శుక్రవారం కాజీపేటకు 18.00 గంటలకు చేరుతుంది. జూన్‌ 28 నుంచి ఆగస్టు 2వ తేదీ వరకు చర్లపల్లి–సుబేదార్‌గంజ్‌ (04122) ఎక్స్‌ప్రెస్‌ ప్రతీ శనివారం 6.30 గంటలకు కాజీపేటకు చేరుతుంది. ఈ రైళ్లకు దక్షిణ మధ్య రైల్వే పరిధి నాగ్‌పూర్‌, బల్లార్షా, సిర్పూర్‌కాగజ్‌నగర్‌, మంచిర్యాల, పెద్దపల్లి, కాజీపేట స్టేషన్లలో అప్‌ అండ్‌ డౌన్‌ రూట్‌లో హాల్టింగ్‌ కల్పించారు. జూన్‌ 26 నుంచి జూలై 2వ తేదీ వరకు యశ్వంత్‌పూర్‌–యోగ్‌నగరి రిషికేశ్‌ (06597) ఎక్స్‌ప్రెస్‌ ప్రతీ శనివారం కాజీపేటకు చేరుతుంది. జూన్‌ 28 నుంచి జూలై 5వ తేదీ వరకు యోగ్‌నగరి రిషికేశ్‌–యశ్వంత్‌పూర్‌ (08598) ఎక్స్‌ప్రెస్‌ ప్రతీ మంగళవారం కాజీపేటకు చేరుతుంది. ఈ రైళ్లకు దక్షిణ మధ్య రైల్వే పరిధిలో ఎలహంకా, హిందుపురం, ధర్మవరం, అనంతపురం, డోన్‌, కర్నూల్‌ సిటీ, కాచిగూడ, కాజీపేట, బల్లార్షా, నాగ్‌పూర్‌లో అప్‌ అండ్‌ డౌన్‌ రూట్‌లో హాల్టింగ్‌ కల్పించారు.

కేయూలో సేంద్రియ పద్ధతిలో మల్బరీ సాగు



కేయూ క్యాంపస్‌: కాకతీయ యూనివర్సిటీలో సెరికల్చర్‌ విభాగం ఆధ్వర్యంలో సేంద్రియ పద్ధతిలో మల్బరీ సాగు చేస్తున్నారు. విశ్వవిద్యాలయం ప్రాంగణంలో అభివృద్ధి చేసిన రెండున్నర ఎకరాల్లో సాగు చేయిస్తున్నారు. దీంతో విద్యార్థులు ఈ సాగుపై ప్రాక్టికల్‌ శిక్షణ పొందుతున్నారు. సేంద్రియ ఎరువుతో మల్బరీ ఆకులు దిగుబడి పెంపుతోపాటు నేల, తేమ నిలుపుదల, పోషకాల లభ్యత మెరుగు పరుస్తున్నామని కేయూ సెరికల్చర్‌ విభాగం అసిస్టెంట్‌ ప్రొఫెసర్లు కె. సుజాత, కనీజ్‌ఫాతిమా మంగళవారం తెలిపారు. ఈ క్షేత్రంలో విద్యార్థులకు నేరుగా వ్యవసాయ అనుభవాన్ని అందిస్తున్నారు. ప్రస్తుతం రెండున్నర ఎకరాల్లో మల్బరీ వనరులతోపాటు టస్సర్‌ సిల్క్‌ వార్మ్‌ కోసం అవసరమైన ఫుడ్‌ ప్లాంట్లు పెంచుతున్నారు. ఇందులో 7 నుంచి 8 రకాల మల్బరీ రకాలున్నాయి. 2010లో యూజీసీ మేజర్‌ రీసెర్చ్‌ ప్రాజెక్టు నిధులతో ఈఫీల్డ్‌ అభివృద్ధి చేశారు. కాగా, కాకతీయ యూనివర్సిటీ సెరికల్చర్‌ రీసెర్చ్‌ యూనిట్స్‌, ఎమ్మెస్సీ సెరికల్చర్‌ కోర్సు అందిస్తోంది.

ఎట్టకేలకు డైరెక్టర్ల నియామకం..

టీజీ ఎన్పీడీసీఎల్‌లో 18 నెలల తర్వాత పోస్టుల భర్తీ..

- డైరెక్టర్లుగా నలుగురు నియామకం
- ఇందులో ఇద్దరు ప్రస్తుత ఇన్‌చార్జ్‌ డైరెక్టర్లు.. మరో ఇద్దరు రిటైర్డ్‌ చీఫ్‌ ఇంజనీర్లు



వంటేరు తిరుపతి రెడ్డి, డైరెక్టర్‌ ఫైనాన్స్‌ | వి. మోహన్‌ రావు, డైరెక్టర్‌ ప్రాజెక్ట్స్‌ | టి.మధుసూదన్‌, డైరెక్టర్‌, ఆపరేషన్స్‌ | సి.ప్రభాకర్‌, డైరెక్టర్‌, హెచ్‌ఆర్‌డీ అండ్‌ ఐఆర్‌

హన్మకొండ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎట్టకేలకు రాష్ట్రంలోని డిస్కంలకు డైరెక్టర్‌ పోస్టులను నియమించింది. ఇందులో భాగంగా నార్తర్న్‌ పవర్‌ డిస్ట్రిబ్యూషన్‌ కంపెనీ లిమిటెడ్‌(టీజీఎన్పీడీసీఎల్‌)కు నలుగురిని నియమించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్‌ సెక్రటరీ నవీన్‌మిత్తల్‌ ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌ అధికారంలోకి రాగానే అప్పటి వరకు ఉన్న టీజీ ఎన్పీడీసీఎల్‌ పాలక మండలిని తొలగించింది. 2024 జనవరి 29న కొత్త పాలక మండలి నియామకంలో భాగంగా డైరెక్టర్‌ పోస్టుల నియామకానికి 2024 జనవరి 30న నోటిఫికేషన్‌కు జారీ చేసింది. అప్పటికే ఐఏఎస్‌ అధికారి కర్నాటి వరుణ్‌ రెడ్డిని చైర్మన్‌, మేనేజింగ్‌ డైరెక్టర్‌గా నియమించింది. అప్పటి వరకు సీనియర్‌ సీజీఎంలను ఇన్‌చార్జ్‌ డైరెక్టర్లుగా నియమించగా వారు ఈ పదవుల్లో కొనసాగుతూ వస్తున్నారు. దీంతో 18 నెలలుగా డైరెక్టర్‌ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ క్రమంలో ఎట్టకేలకు డైరెక్టర్‌ పోస్టులను భర్తీ చేసింది. కాగా, వంటేరు తిరుపతి రెడ్డి (ఫైనాన్స్‌), టి.మధుసూదన్‌ (ఆపరేషన్స్‌), వంగూరు మోహన్‌ రావు (ప్రాజెక్ట్స్‌), సి.ప్రభాకర్‌ (హెచ్‌ఆర్‌డీ–ఐఆర్‌)ను డైరెక్టర్లగా నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో ఇద్దరు బీసీలు, ఓసీ, ఎస్సీ ఒక్కొక్కరున్నారు. ఈ నెల 27న కొత్త డైరెక్టర్లు బాధ్యతలు స్వీకరించనున్నారు.

17 జిల్లాల పరిధిలో విస్తరణ..

రాష్ట్రంలో మొత్తం 33 జిల్లాలుండగా టీజీ ఎన్పీడీసీఎల్‌ 17 జిల్లాలు, 299 మండలాల్లో విస్తరించి ఉంది. 5,580 గ్రామాలు, 7,474 హామ్లేట్‌లకు విద్యుత్‌ పంపిణీ చేస్తుంది. 68,62,858 విద్యుత్‌ సర్వీస్‌లున్నాయి. 9 వేలకు పైగా ఉద్యోగులు పని చేస్తున్నారు. 2024 జనవరి 30న నాలుగు డైరెక్టర్‌ పోస్టులకు నోటిఫికేషన్‌ జారీ చేసిన ప్రభుత్వం.. 2024 మార్చి 2వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించింది. దాదాపు 83 మంది ఆశావహులు దరఖాస్తు చేసుకున్నట్లు సమాచారం. ఇందులో టీజీ ఎన్పీడీసీఎల్‌లో సీజీఎంలుగా పని చేస్తున్న వారు కూడా దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో ఇద్దరికి మాత్రమే అవకాశం లభించింది. ఇదే కంపెనీలో సీజీఎం (సీఈ)లుగా పని చేసి రిటైర్డ్‌ అయిన ఇద్దరికి డైరెక్టర్లుగా అవకాశం లభించింది. ప్రస్తుతం సీజీఎంలు, చీఫ్‌ ఇంజనీర్లుగా కొనసాగుతున్న వంటేరు తిరుపతి రెడ్డి, టి.మధుసూదన్‌, సదర్‌లాల్‌, అశోక్‌ కుమార్‌, రాజు చౌహాన్‌ డైరెక్టర్‌ పదవి కోసం దరఖాస్తు చేసుకోగా ఇందులో వంటేరు తిరుపతి రెడ్డికి ఫైనాన్స్‌ డైరెక్టర్‌గా, టి.మధుసూదన్‌ను ఆపరేషన్‌ డైరెక్టర్‌గా నియమించింది. అదే విధంగా హెచ్‌ఆర్‌డీ సీజీఎంగా రిటైర్డ్‌ అయిన సి.ప్రభాకర్‌ను హెచ్‌ఆర్‌డీ–ఐఆర్‌ డైరెక్టర్‌గా, ప్రాజెక్టు సీజీఎంగా ఇన్‌చార్జ్‌ డైరెక్టర్‌గా కొనసాగుతూ రిటైర్డ్‌ అయిన వంగూరు మోహన్‌ రావును ప్రాజెక్టు డైరెక్టర్‌గా నియమించింది. కాగా, డైరెక్టర్‌ పదవిని ఆశించిన సదర్‌లాల్‌, అశోక్‌ కుమార్‌, రాజు చౌహాన్‌కు నిరాశే మిగిలింది. ఇందులో సదర్‌ లాల్‌, అశోక్‌కుమార్‌, ఇన్‌చార్జ్‌ డైరెక్టర్‌లుగా కొనసాగుతున్నారు. ఇక నుంచి వీరు సీజీఎంలుగా మాత్రమే కొనసాగనున్నారు.

సీజీఎంలు, రిటైర్డ్‌ సీజీఎంలు దరఖాస్తులు..

డైరెక్టర్‌ పోస్టుల కోసం జెన్‌కో, ట్రాన్స్‌కో, టీజీ ఎన్పీడీసీఎల్‌, టీజీ ఎస్పీడీసీఎల్‌లో పని చేస్తున్న సీజీఎంలు, రిటైర్డ్‌ సీజీఎంలు దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తులు పెద్ద ఎత్తున రావడంతో తీవ్ర పోటీ నెలకొంది. ఈ క్రమంలో దరఖాస్తుల దారులపై ఇంటెలిజెన్స్‌ అధికారులు సుదీర్ఘంగా అధ్యయనం చేసి నివేదిక సమర్పించారు. ప్రభుత్వం ఈ నివేదికను పరిశీలించి నియామకాలు చేపట్టినట్లు తెలిసింది.

రైతులు పంట మార్పిడి చేపట్టాలి



కాకర



ఆయిల్‌ పామ్‌



జామ

- మార్కెట్‌ డిమాండ్‌ ఉన్న పంటలు సాగుచేయాలి
- జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమల శాఖ అధికారి జినుగు మరియన్న

మహబూబాబాద్‌ రూరల్‌ : రైతులు పంట మార్పిడి చేపట్టాలని, వరి, మిర్చి, పత్తికి ప్రత్యామ్నాయంగా కూరగాయలు, పండ్లు, ఆయిల్‌ పామ్‌ సాగు చేపట్టాలని మహబూబాబాద్‌ జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమల శాఖ అధికారి జినుగు మరియన్న అన్నారు. ఈమేరకు పంటమార్పిడి విధానం, ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు పలు సూచనలు చేశారు. పంట మార్పిడితో రైతులకు ఆదాయ మార్గాలు ఏర్పడుతాయని, మార్కెట్‌ డిమాండ్‌ ఉన్న పంటలు సాగుచేసి ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. మహబూబాబాద్‌ జిల్లాలో ఆయిల్‌ పామ్‌ సాగు చేస్తూ పలువురు రైతులు ఎకరానికి రూ. లక్షకు పైగా ఆదాయం పొందుతున్నారన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి..

బోర్ల కింద కూరగాయలు, పండ్లు, ఆయిల్‌ పామ్‌, పూలు, మల్బరీ, పలు రకాల ఉద్యాన పంటలు సాగు చేయాలన్నారు. ప్రతీ రైతు పొలం గట్ల మీద, పొలం చుట్టూ, పెరట్లో, ఆయిల్‌ పామ్‌, పండ్ల తోటల్లో అంతర పంటలుగా, డాబాల మీద, ఇంటి ముంగిట రోజువారి అవసరాల నిమిత్తం అన్ని రకాల కూరగాయలను సాగు చేసుకోవాలన్నారు. కూరగాయల సాగులో మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలని మరియన్న తెలిపారు.

క్రెడాయి నూతన కార్యవర్గం ఎన్నిక



ఉమ్మడి వరంగల్‌ జిల్లా క్రెడాయి నూతన కార్యవర్గం

- ఉమ్మడి వరంగల్‌ జిల్లా అధ్యక్షుడిగా నాయిని అమరేందర్‌ రెడ్డి

నయీంనగర్‌: దేశంలో ప్రముఖ నిర్మాణ సంస్థగా పేరుగాంచిన 'ది కాన్ఫడరేషన్‌ ఆఫ్‌ రియల్‌ ఎస్టేట్‌ డెవలపర్స్‌ అసోసియేషన్‌ ఆఫ్‌ ఇండియా' (క్రెడాయి) ఉమ్మడి వరంగల్‌ జిల్లా శాఖ నూతన కార్యవర్గాన్ని ప్రకటించింది. చైర్మన్‌గా ఎర్రబెల్లి తిరుపతి రెడ్డి, అధ్యక్షుడిగా నాయిని అమరేందర్‌ రెడ్డి, ప్రెసిడెంట్‌ ఎలక్టెడ్‌గా కంది శ్రీనివాస్‌ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా శాఖమూరి అమర్‌, ఉపాధ్యక్షులుగా రాజేందర్‌ రెడ్డి, రజనీకాంత్‌ రెడ్డి, రవీందర్‌ రెడ్డి, కోశాధికారిగా వరుణ్‌కుమార్‌ అగర్వాల్‌, ఆర్గనైజింగ్‌ సెక్రెటరీగా రాజ్‌కుమార్‌, సంయుక్త కార్యదర్శులుగా కొండా రెడ్డి, నాగరాజు, మల్లారెడ్డి, తదితర పాలకవర్గ సభ్యులు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సమావేశానికి క్రెడాయి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ప్రేమ్‌ సాగర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై నూతన కార్యవర్గాన్ని అభినందించారు. ఈ సందర్భంగా ప్రేమ్‌ సాగర్‌ రెడ్డి మాట్లాడుతూ నిర్మాణ రంగంలో పారదర్శకత, నాణ్యత, వినియోగదారుల విశ్వాసం నిలబెట్టే దిశగా క్రెడాయి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. అనంతరం నూతన చైర్మన్‌ తిరుపతి రెడ్డి, అధ్యక్షుడు నాయిని అమరేందర్‌ రెడ్డి మాట్లాడుతూ నిర్మాణ రంగం ప్రాంతీయ అభివృద్ధికి కీలక చక్రంగా నిలుస్తుందన్నారు. నూతన కార్యవర్గం స్థిరాస్తి రంగాన్ని మరింత న్యాయంగా, పారదర్శకంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తుందన్నారు. కస్టమర్ల విశ్వాసం పెంపొందించడమే లక్ష్యంగా ప్రభుత్వ సంస్థలతో సమన్వయం, బిల్డర్ల సమస్యల పరిష్కారం కోసం క్రెడాయి అంకితభావంతో పనిచేస్తుందన్నారు. 'కుడా', డీటీసీపీ, జీడబ్ల్యూఎంసీ వంటి సంస్థలతో సమన్వయానికి క్రెడాయి పటిష్ట వేదికగా నిలుస్తుందని తెలిపారు. పరిశుభ్రత, నాణ్యత, నిబంధనలు పాటిస్తామన్నారు. త్వరలో చిన్న డెవలపర్లకు ప్రోత్సాహం, యూత్‌ ఆర్మ్‌, మహిళా బిల్డర్లకు ప్రాధాన్యం, వృత్తిపర శిక్షణ కార్యక్రమాలు ప్రారంభమవుతాయని వారు పేర్కొన్నారు.

ఆయన మరణం.. ఐదుగురికి జీవం

- వృద్ధుడి అవయవాలు దానం
- కుటుంబీకులను అభినందించిన బంధువులు, గ్రామస్తులు



కొండయ్య (ఫైల్‌)

దేవరుప్పుల : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఓ వృద్ధుడు.. తాను చనిపోయి ఐదుగురికి జీవం పోశాడు. బ్రెయిన్‌డెడ్‌ అయిన ఆ వృద్ధుడి అవయవాలు దానం చేశారు. దీంతో ఆ కుటుంబీకులను గ్రామస్తులు, బంధువులు అభినందించారు. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. జనగామ జిల్లా దేవరుప్పుల మండలం కడవెండికి చెందిన బొందుగుల కొండయ్య (60) ఈ నెల 20వ తేదీన జనగామ–సూర్యాపేట రహదారి సీతారాంపురం స్టేజీ సమీపంలో కారు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటనలో అపస్మారక స్థితిలోకి వెళ్లిన కొండయ్యను మెరుగైన వైద్యం కోసం సికింద్రాబాద్‌లోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు నాలుగు రోజులు చికిత్స చేసినా కొండయ్య అచేతన(బ్రెయిన్‌డెడ్‌) స్థితిలోకి వెళ్లాడు. దీంతో మృతుడి భార్య అంజమ్మ, కుమారుడు మహేశ్‌, కూతురు వైష్ణవి అంగీకారంతో ఆస్పత్రి వైద్యులు కొండయ్య అవయవాలు తీశారు. వీటిని శస్త్రచికిత్స ద్వారా ఐదుగురికి అమర్చనున్నారు. కాగా, కొండయ్య మృతదేహాన్ని మంగళవారం సాయంత్రం స్వగ్రామం కడవెండికి తీసుకురాగా కుటుంబీకులు, బంధువులు, గ్రామస్తులు అంత్యక్రియలు నిర్వహించారు.

ఉపాధ్యాయుల గైర్హాజర్‌పై ఎంఈఓ విచారణ



'సాక్షి'లో ప్రచురితమైన కథనం

సాక్షి స్పందన

గార్ల: 'తెరుచుకోని ప్రభుత్వ గిరిజన పాఠశాల' అనే శీర్షికతో మంగళవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి ఎంఈఓ ఎం. వీరభద్రం స్పందించారు. డీఈఓ ఆదేశాల మేరకు మండలంలోని సర్వన్‌తండా ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఒకే రోజు ఇద్దరు ఉపాధ్యాయులు విధులకు ఎందుకు గైర్హాజరయ్యారనే అంశంపై ఇతర టీచర్లను విచారించారు. అనంతరం ఉపాధ్యాయుల హాజరు పట్టికను పరిశీలించారు. ఈ నివేదికను జిల్లా అధికారులకు సమర్పించనున్నట్లు ఎంఈఓ ఎం. వీరభద్రం పేర్కొన్నారు.



టీచర్ల హాజరుపట్టికను పరిశీలిస్తున్న ఎంఈఓ వీరభద్రం

బైలాకు విరుద్ధంగా ఎంపికైన కమిటీ చెల్లదు

- తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ నేతల స్పష్టీకరణ



మాట్లాడుతున్న దానయ్య

హన్మకొండ: బైలాకు విరుద్ధంగా ఎలాంటి ఎన్నికల నోటిఫికేషన్‌ లేకుండా కమిటీని ఎంపిక చేశారని, ఇది చెల్లదని తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ టీజీ ఎన్పీడీసీఎల్‌ కంపెనీ కార్యదర్శి బక్క దానయ్య, ఇతర నాయకులు స్పష్టం చేశారు. ఈ మేరకు మంగళవారం హనుమకొండ బాలసముద్రంలో అసోసియేషన్‌ ఎన్పీడీసీఎల్‌ శాఖ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏ అసోసియేషన్‌లోనైనా ఎన్నికలు నిర్వహించడానికి ముందు పాత కమిటీలను రద్దు చేసి కొత్త కమిటీలు ఎన్నుకుంటారన్నారు. ఈ పద్ధతిలో ఎన్నికైన కమిటీని మాత్రమే సంబంధిత అధికారులకు పరిచయం చేస్తారన్నారు. అయితే అసోసియేషన్‌ నుంచి బహిష్కరణకు గురైన మాతంగి శ్రీనివాస్‌ అనే వ్యక్తి మాత్రం బైలాకు వ్యతిరేకంగా ఎన్పీడీసీఎల్‌ శాఖ నూతన కమిటీని ఏర్పాటు చేసినట్లు సీఎండీకి పరిచయం చేయడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. ఈ కమిటీ చెల్లదని స్పష్టం చేశారు. ఈ కమిటీని అధికారులు పరిగణనలోకి తీసుకోవద్దని వారు కోరారు.

కల్పనది హత్యానా..? ఆత్మహత్యనా?

- పోలీసుల అదుపులో భర్త
- కొనసాగుతున్న విచారణ

మామునూరు: ఖిలా వరంగల్‌ మండలం బొల్లికుంట గ్రామంలో ఇటీవల ఓ మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన విషయం విదితమే. మృతురాలు కల్పన(34), పసునూరి రవి కిరణ్‌ దంపతులు. రవి కిరణ్‌ ట్రాక్టర్‌ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. నెల రోజుల క్రితం ముగ్గురు కుమారుల్లో ఓ కుమారుడికి గుండె సంబంధ సమస్య వచ్చింది. దీంతో హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్‌ ఆస్పత్రిలో చికిత్స పొంది ఇంటికి చేరారు. ఈ క్రమంలో ఈనెల 19వ తేదీన మధ్యాహ్నం ఇంట్లోనే కల్పన అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. కల్పన శరీరంపై అక్కడక్కడ గాయాలు ఉండడంతో ఇది ఆత్మహత్య కాదు.. హత్యే అయి ఉంటుందని స్థానికులు చర్చించుకుంటున్నట్లు తెలిసింది. ఇది ఆత్మహత్య కాకుంటే.. మరి ఎవరైనా హత్య చేసి ఉంటారా అనే కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నట్లు సమాచారం. ఇప్పటికే కల్పన భర్తతోపాటు అనుమానాస్పద వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారణ చేపడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. పోలీసుల విచారణలో హత్య మిస్టరీ వీడే అవకాశం ఉందని పలువురు పేర్కొంటున్నారు.

ఇనుగుర్తిలో విషాదఛాయలు

- హైదరాబాద్‌లో గ్రామవాసి అంజలి హత్య
- మిన్నంటిన కుటుంబీకులు, గ్రామస్తుల రోదనలు



అంజలి మృతదేహం వద్ద సంతాపం తెలుపుతున్న కళాకారులు, బంధువులు

కేసముద్రం: ఇనుగుర్తిలో విషాదఛాయలు నెలకొన్నాయి. గ్రామానికి చెందిన సట్ల అంజలి(39)హైదరాబాద్‌లో తన పెద్ద కూతురు, ఆమె ప్రియుడి చేతిలో సోమవారం రాత్రి హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆమె మృతదేహం మంగళవారం రాత్రి తన స్వగ్రామం ఇనుగుర్తికి చేరింది. ఆమె మృతదేహాన్ని చూసిన కుటుంబ సభ్యులు, బంధువులు, మిత్రులు బోరున విలపించారు. గ్రామానికి చెందిన సట్ల ధనమ్మ, మల్లయ్య దంపతుల రెండో కూతురు అంజలికి 18 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ఈ క్రమంలో హైదరాబాద్‌లోని జీడిమెట్లలో కుటుంబ సభ్యులతో కలిసి జీవనం సాగిస్తూ, తెలంగాణ సాంస్కృతిక సారథిలో గాయకురాలిగా పనిచేస్తోంది. రెండేళ్ల క్రితం ఆమె భర్త మృతి చెందాడు. కాగా, అంజలి పెద్దకూతురు ఓ యువకుడితో ప్రేమలో పడింది. దీనిని అంజలి నిరాకరించగా, పెద్దకూతురు, తన ప్రియుడితో కలిసి ఆమెను హత్య చేశారు. కాగా, ఇనుగుర్తిలో అంజలి మృతదేహంపై పీఆర్‌ఓ రాజేంద్రప్రసాద్‌ పూలమాలలు వేసి నివాళులర్పించారు. సాంస్కృతిక కళాబృందం సభ్యులు గీతాలు ఆలపించి నివాళులర్పించారు.

అంజలికి.. చాకలి ఐలమ్మతో ఎలాంటి సంబంధమూ లేదు..

పాలకుర్తి టౌన్‌: అంజలి.. వీరనారి చాకలి ఐలమ్మ మునిమనుమరాలిగా సామాజిక మాధ్యమాల్లో వైరలైంది. దీనిపై ఐలమ్మ మనుమడు చిట్యాల సంపత్‌ స్పందించారు. సట్ల అంజలికి, ఐలమ్మకు ఎలాంటి సంబంధమూ లేదని, ఇద్దరూ ఒకటే సామాజికవర్గం అయినంత మాత్రాన కుటుంబ వారసురాలిగా వైరల్‌ చేయడం సరికాదని తెలిపారు. గతంలోనూ తన నాయనమ్మ పేరు వాడితే మా తండ్రి రామచంద్రు ఆమెను హెచ్చరించారని గుర్తు చేశారు.

తల్లి, కొడుకు అదృశ్యం

ఖిలా వరంగల్‌: వరంగల్‌ మిల్స్‌కాలనీ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని చింతల్‌ చెందిన ఓ వివాహిత తోపాటు ఆమె 11 ఏళ్ల కుమారుడు అదృశ్యమైనట్లు మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్‌ రమేశ్‌ తెలిపారు. వరంగల 36వ డివిజన్‌ చింతల్‌ ప్రాంతానికి చెందిన వనం వేణుకు కీర్తనతో 13 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. ఈ దంపతులకు 11 ఏళ్ల కుమారుడు ఈశ్వర్‌ ఉన్నాడు. ఈ క్రమంలో ఈనెల 22న మధ్యాహ్నం పని ఉందంటూ కీర్తన తన కుమారుడిని తీసుకుని లేబర్‌ కాలనీ వెళ్లింది. సాయంత్రమైనా తిరిగి రాలేదు. బంధువులు, తెలిసిన చోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. ఈ ఘటనపై వేణు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్‌ రమేశ్‌ మంగళవారం తెలిపారు.

సివిల్స్‌లో ఉచిత శిక్షణ దరఖాస్తుల కరపత్రం ఆవిష్కరణ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్‌ రామచంద్రం

కేయూ క్యాంపస్‌ : ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పేద విద్యార్థులకు సివిల్స్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్న నేపథ్యంలో ఆ శిక్షణకు సంబంధించిన దరఖాస్తుల ఆహ్వాన కరపత్రాలను కాకతీయ యూనివర్సిటీలో వీసీ కె. ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్‌ వి. రామచంద్రం మంగళవారం ఆవిష్కరించారు. హైదరాబాద్‌లోని బంజారా హిల్స్‌ రోడ్‌ నంబర్‌14 కేబీఆర్‌ పార్క్‌ ఎదుట ఉన్న షెడ్యూల్డ్‌ కులాల అభివృద్ధి సంస్థ అధ్యయన కేంద్రంలో 2025–2026 విద్యాసంవత్సరంలో ప్రవేశాలకు సంబంధించి నిర్వహించే సివిల్స్‌ ప్రిలిమినరీ పరీక్షకు ఆన్‌లైన్‌లో జూలై 7వరకు దరఖాస్తులు చేసుకోవాలని సంబంధిత అధికారులు కోరారు. ఉచిత శిక్షణకు దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులకు జూలై 13న ఎంపిక పరీక్ష నిర్వహిస్తారు. ఇందులో ఎంపికైన వారికి ఎస్సీ స్టడీ సర్కిల్‌లో ప్రవేశం కల్పించి ఉచిత భోజనంతోపాటు శిక్షణ ఇస్తారు. ఈ కరపత్రం ఆవిష్కరణ కార్యక్రమంలో తెలంగాణ ఎస్సీ స్టడీ సర్కిల్‌ ఉమ్మడి వరంగల్‌ జిలా శాఖ డైరెక్టర్‌ జగన్మోహన్‌, కేయూ హాస్టళ్ల డైరెక్టర్‌ ఎల్‌పి. రాజ్‌కుమార్‌,అంబేడ్కర్‌ స్టడీసెంటర్‌ డైరెక్టర్‌ సిహెచ్‌. రాజ్‌కుమార్‌, డాక్టర్‌ సూరాసి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పాము కాటుతో వ్యక్తి మృతి

- రామయ్యపల్లిలో ఘటన

ములుగు రూరల్‌: పాము కాటుతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని కాశిందేవిపేట గ్రామ పంచాయతీ పరిధి రామయ్యపల్లిలో మంగళవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గుగులోత్‌ సోమ్లా (52) రాత్రి సమయంలో మూత్ర విసర్జనకు బయటకు వెళ్లాడు. ఈ క్రమంలో కాలుకు ఏదో కుట్టిందని భార్య కరుణకు చెప్పాడు. వర్షం కారణంగా ఆస్పత్రికి తీసుకెళ్లలేక ఏదో పురుగు కుట్టి ఉంటుందని నిద్రించారు. ఉదయం 4 గంటల సమయంలో నిద్ర లేపగా సోమ్లా మృతి చెంది కనిపించాడు. ఈ ఘటనపై మృతుడి భార్య కరుణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటేశ్వర్‌రావు తెలిపారు.

డీసీసీబీ టర్నోవర్‌ రూ.2,230 కోట్లు

- రూ.5.10 కోట్ల లాభాలు
- వరంగల్‌ డీసీసీబీ, టెస్కాబ్‌ చైర్మన్‌ మార్నేని రవీందర్‌ రావు



మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్‌ మార్నేని రవీందర్‌ రావు

హన్మకొండ: వరంగల్‌ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు రూ.2,230.56 కోట్ల టర్నోవర్‌కు చేరుకుందని తెలంగాణ స్టేట్‌ కోఆపరేటివ్‌ అపెక్స్‌ బ్యాంకు, వరంగల్‌ డీసీసీబీ చైర్మన్‌ మార్నేని రవీందర్‌ రావు అన్నారు. మంగళవారం హనుమకొండ నక్కలగుట్టలోని డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో మహాజన సభ జరిగింది. పూర్వ వరంగల్‌ జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల చైర్మన్లు, సభ్య సంఘాల చైర్మన్లు పాల్గొన్న ఈ సభకు మార్నేని రవీందర్‌ రావు అధ్యక్షత వహించి మాట్లాడారు. 2024–2025 ఆర్థిక సంవత్సరంలో వరంగల్‌ డీసీసీబీ రూ.5.10 కోట్ల లాభాలు గడిచిందన్నారు. రూ.1,634.79 కోట్ల రుణాలు అందించినట్లు తెలిపారు. రూ.595.77 డిపాజిట్లు సేకరించినట్లు వివరించారు. రైతులు, వ్యవసాయ అనుబంధ రంగాలకు అందించిన ఆర్థిక సేవలు, క్వాలిటీ మేనేజిమెంట్‌ సిస్టమ్‌ను గుర్తించిన అంతర్జాతీయ ప్రామాణిక సంస్థ ఐఎస్‌ఓ 9001 సర్టిఫికెట్‌ జారీ చేసిందన్నారు. వరంగల్‌ డీసీసీబీ పరిధిలోని పీఏసీఎస్‌లు, రైతు సేవ సహకార సంఘాలను బహుళార్థక సేవా కేంద్రాలు (ఎంఎస్‌సీ)గా పరివర్తింపజేస్తూ ఆర్థికంగా బలపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఆత్మ నిర్బర్‌ భారత్‌ అభియాన్‌ పథకం కింద డీసీసీబీకి అతి తక్కువ వడ్డీ 4శాతంతో రుణాలు ఇచ్చిందని, 70 పీఏసీఎస్‌లకు గాను 50 సంఘాలకు 129 ఆక్టివిటీస్‌కు రూ.54.72 కోట్ల రుణం మంజూరు చేసిందన్నారు. ఈ రుణంతో ఆదాయం పెంచుకుని సంఘాలు ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నాయన్నారు. ఎంఎస్‌సీలో దేశంలో వరంగల్‌ డీసీసీబీ ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. కేంద్ర ప్రభుత్వం నాబార్డు ఆధ్వర్యంలో పీఏసీఎస్‌ల ద్వారా అన్ని రకాల సేవలు అందించేందుకు ఫాక్స్‌ ఆక్సిలేటర్‌ ప్రోగ్రామ్‌ను ప్రవేశ పెట్టిందన్నారు. ఈ కార్యక్రమం కింద దేశంలోని మూడు రాష్ట్రాల్లో 35 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను ఎంపిక చేసిందన్నారు. రాష్ట్రంలో వరంగల్‌, కరీంనగర్‌ డీసీసీబీల్లో 12 పీఏసీఎస్‌లను ఎంపిక చేసిందన్నారు. వరంగల్‌ డీసీసీబీలో నందనం, నల్లబెల్లి, మహబూబాబాద్‌, ధనసరి పీఏసీఎస్‌లను ఎంపిక చేశారని వివరించారు. 2025–2026 ఆర్థిక సంవత్సరంలో బ్యాంకు టర్నోవర్‌ను రూ. 2,230.56 నుంచి రూ.2,600 కోట్లు సాధించాలని లక్ష్యం విధించుకున్నట్లు తెలిపారు. అనంతరం ఆయా సంఘాల చైర్మన్లు మాట్లాడుతూ పీఏసీఎస్‌లకు అవసరమైన ఎరువులు సరఫరా కావడం లేదని, దీనిపై స్పందించి వ్యవసాయాధికారులతో మాట్లాడి ఎరువులు సరఫరా చేయించాలన్నారు. అనంతరం ఇటీవల మృతి చెందిన చెన్నారావుపేట పీఏసీఎస్‌ చైర్మన్‌ ఎం.సత్యనారాయణ రెడ్డి, కంచపల్లి పీఏసీఎస్‌ చైర్మన్‌ రవీందర్‌కు నివాళులర్పించారు. సమావేశంలో సీఈఓ వజీర్‌ సుల్తాన్‌, నాబార్డ్‌ డీడీఎం చంద్రశేఖర్‌, మార్క్‌ ఫెడ్‌ డైరెక్టర్‌ రంగారావు, డీసీఓలు సంజీవ రెడ్డి, నీరజ , వెంకటేశ్వర రావు, రాజేందర్‌ రెడ్డి, వాల్యానాయక్‌, సర్దార్‌ సింగ్‌, నాగేశ్వర రావు, టీజీ క్యాబ్‌ జీఎం సుజాత, డీసీసీబీ డీజీఎం అశోక్‌, జీఎంలు ఉషశ్రీ, పద్మావతి, ఏజీఎంలు మధు, గొట్టం స్రవంతి, గంప స్రవంతి, రాజు, కృష్ణ మోహన్‌, డైరెక్టర్లు పాల్గొన్నారు.